క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లు బంద్

సారంగపూర్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మండలకేంద్రంలోని కేథరినాథ్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్ల ప్రక్రియ నేటి నుంచి ఈనెల 15వరకు నిలిపివేస్తున్నామని ఏఎంసీ కార్యదర్శి ధూమ్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి.. పత్తిని మార్కెట్‌కు తరలించొద్దని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు


ఆలయంలో హన్మంతరావు, భక్తులు

బాసర: మండలకేంద్రంలోని జ్ఞానసరస్వతీ అమ్మవారిని శుక్రవారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి బాసరకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. సైలాని దర్గా వద్ద పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్‌తో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నేతలు కేక్ కట్ చేశారు.

చికిత్స పొందుతూ బాటసారి మృతి


పోశెట్టి (ఫైల్)

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామానికి చెందిన బాలేరావ్ పోశెట్టి (20) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. పోశెట్టి గురువారం రాత్రి ఏడు గంటలకు ఇంటి నుంచి నడుచుకుంటూ సబ్‌స్టేషన్ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ యువకుడిని స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మద్యం తాగి నడిపితే చర్యలు


పరీక్ష చేస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

తానూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బెల్‌తరోడా వద్ద చేస్తున్న వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను పరిశీలించారు. సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

మద్యం పట్టివేత

బెల్‌తరోడా బెల్ట్‌షాపులో తనిఖీ చేసి రూ.ఐదు వేల విలువైన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. సదరు మద్యం సీసాలను ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుపైనే మందుబాబు నిద్ర


అడ్డంగా పడుకున్న మందుబాబు

కుభీర్: మండలకేంద్రంలోని వివేకానంద చౌరస్తా సమీపంలో రోడ్డుపైనే ఓ మందుబాబు నిద్రించడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొందరు ఆయనను పక్కకు తీసుకెళ్లినా మళ్లీ వచ్చి రోడ్డుపై పడుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి అతడిని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ సమీపంలోనే వైన్స్ షాపు ఉంది.


భైంసాటౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు


లక్ష్మణచాందలో స్వామివారి పల్లకిసేవలో గ్రామస్తులు


నిర్మల్‌రూరల్ : చిట్యాల ఆలయంలో బారులు తీరిన భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి, అభిషేకం, అర్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఆలయాల్లోని క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గోవిందుడి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భైంసాలోని పద్మావతి కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్, భైంసా కోర్టు జడ్జి డి.దేవేంద్రబాబు పూజలు చేశారు. నిర్మల్‌రూరల్ మండలంలోని చిట్యాల, అక్కాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ ఆలయం, దిలావర్‌పూర్ రామాలయం, గుండంపల్లి పరిసరాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, అత్యంత ప్రాశస్త్యం కల్గిన కదిలి పాపహరేశ్వరాలయం, కాల్వ పరిసరాల్లో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఖానాపూర్ ఆలయంలో ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు


దిలావర్‌పూర్‌లోని రామాలయంలో..


మామడ : పొన్కల్‌లో..


సోన్: న్యూవెల్మల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


బాసరలోని వేంకటేశ్వర కాలనీలో..

12న యువజన ఉత్సవాలు

నిర్మల్‌టౌన్: డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీసెస్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 12న నిర్మల్‌లో యువజన ఉత్సవాలు నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వివేకానంద చౌక్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి యువజన సంఘాల వారు హాజరు కావాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కుభీర్: మండలంలోని చాతా గ్రామానికి చెందిన సంధ్య అనే గర్భిణి గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది లక్ష్మణ్, పైలట్ సుబేదార్ ప్రసవం చేయగా సంధ్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

‘కోనోకార్పస్ చెట్లను తొలగించాలి’

నిర్మల్‌చైన్‌గేట్: అనారోగ్య సమస్యలకు కారణమయ్యే కోనోకార్పస్ చెట్ల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పసీఉద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ జిల్లా యంత్రాంగం స్పందించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు పోశెట్టి, శంభు, అతీక్ ఉన్నారు.

అందుబాటులో జొన్న విత్తనాలు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో సబ్సిడీపై జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో రాంచందర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూలే సుచిత్ర రకం నాలుగు కిలోల బస్తా ధర రూ.140, పీఎస్‌వీ–15 రకం ఐదు కిలోల బస్తా ధర రూ.250 ఉంటుందని తెలిపారు. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

• ఎమ్మెల్యే రామారావ్ పటేల్


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: మండలంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. గతేడాది భారీవర్షాలకు మండలంలోని బెల్‌తరోడా చెరువుకట్ట తెగిపోయింది. చెరువుకట్ట మరమ్మతులకు రూ.47లక్షలు మంజూరవగా.. శుక్రవారం ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. హిప్నెల్లి గ్రామ చెరువు మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్‌పటేల్, మాజీ సర్పంచ్ గోపా సాయినాథ్, నాయకులు చిన్నారెడ్డి, శివాజీపటేల్, సోమ్‌నాథ్, దేవిదాస్, బాలాజీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ..

మండలకేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్ 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ లింగంమూర్తి, తదితరులున్నారు.

‘కదిలె’ను పంచాయతీగా ఏర్పాటు చేయాలి


శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ మండలం మాడెగాం పంచాయతీ పరిధిలోని కదిలే గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ ఊరి ప్రజలు శుక్రవారం నిర్మల్‌లోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు వినతిపత్రం అందించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పాల్దె అనిల్, దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఏనుగు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: కుమ్మరి జాగృతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నిర్మల్ పట్టణ అధ్యక్షులు చిన్ను, ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, సొసైటీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, కొత్తపల్లి రఘు, శ్రీనివాస్, నగేశ్ పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పూజలు చేశారు.

‘మహా ప్రదర్శన’కు తరలిరావాలి

నిర్మల్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని హైదరాబాద్‌లో వచ్చే నెల 7న లక్ష డప్పులు, వేల గొంతుకలతో నిర్వహించే మహా ప్రదర్శనకు ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి.. తక్షణమే వర్గీకరణను అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న వివేక్ వెంకటస్వామి తన బుద్ధి మార్చుకోవాలన్నారు. ఈనెల 23న మందకృష్ణ మాదిగ జిల్లాకు రానున్ననట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్, నందకుమార్, రవి, బాబురావు, పిరమల్ బాబు, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు తెలుసుకోవాలి

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు తెలుసుకోవాలని భైంసా పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఉన్నారు.

‘పెండింగ్ బిల్లులను విడుదల చేయండి’

సోన్: గతంలో సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని శుక్రవారం మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోన్‌లో విలేకరులతో మాట్లాడారు. బిల్లులు రాకపోవడంతో పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కోరారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా గంగారెడ్డి



సోన్: బీజేపీ సోన్ మండలాధ్యక్షుడిగా మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన మార గంగారెడ్డి నియమితులైనట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా నర్సాపూర్, లక్ష్మణచాంద సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఖానాపూర్: ఖానాపూర్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించేందుకు శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సబ్ డివిజన్ అధికారి లక్ష్మణ్‌నాయక్, ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో భైంసాలోని నిర్మల్ రోడ్, ఓవైసీ నగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్, మదీనా కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలి

కుంటాల: సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఎస్సై సీహెచ్. భాస్కరాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊర్లెళ్లేవారు తమ అడ్రస్ వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఉంటే ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అపరిచితులు కనిపిస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

నూతన నియామకం

ముధోల్: మండలకేంద్రం నుంచి బీజేపీ జిల్లా కౌన్సిలర్ సభ్యులుగా మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, పార్టీ మండలాధ్యక్షుడిగా కోరి పోతన్న నియమితులయ్యారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ర్యాలీ

ముధోల్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దామని సోషల్ జస్టిష్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి అన్నారు. శుక్రవారం ముధోల్‌లో పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎంపీవో పర్యటన

ఖానాపూర్: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీవో రత్నాకర్‌రావు.. సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని రాజుర, చందునాయక్‌తండా, సింగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు.సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కడెం: మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాల జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ 15 మంది పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్‌ఎం వెంకటరమణ, భూమేశ్వర్, రాజేశ్వర్ ఉన్నారు.

కుంటాల: విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలని డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించి మాట్లాడారు. హెచ్‌ఎం రాజేశ్వర్, చిన్నారెడ్డి, రమణాగౌడ్, లక్ష్మణ్‌పటేల్, సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎస్.కృష్ణ శుక్రవారం రూ.1500 విలువైన గురుకుల ప్రవేశపరీక్షకు సంబంధించి పుస్తకాలు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ముత్యంరెడ్డి.. ఉపాధ్యాయుడు కృష్ణను అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం దేవిదాస్, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, అశోక్, హరీశ్, రాగిణి తదితరులు ఉన్నారు.

12న మెటీరియల్ పంపిణీ

భైంసాటౌన్: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే ఆంగ్లం, తెలుగు మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు మాల ఉద్యోగుల సంఘం డివిజన్ నాయకులు ధర్మాజీ చందానే ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నర్సింహనగర్‌లో ఉన్న డాక్టర్స్ అసోసియేషన్ భవన్‌లో ఉదయం 11:30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

12న నాయకపోడ్‌ల సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో నాయకపోడ్ ఉద్యోగ, కులస్తుల సమావేశం ఈనెల 12న నిర్వహించనున్నట్లు నాయకపోడు ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సొండి శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని.. సంఘం రాష్ట్ర కోశాధికారి కె.భీమేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య, జిల్లా అధ్యక్షుడు పి.శంకర్, నాయకులు హాజరవుతారని.. ఆదివారం ఉదయం 11 గంటల్లోగా సమావేశానికి రావాలని సూచించారు.

‘ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆశీర్వదించండి’

నిర్మల్‌టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని యాటకరి సాయన్న అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ప్రజాసేవ కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు వివరించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, రవిరాజ్, గంగాధర్‌రావు, బాలకృష్ణ, రాందాస్, వేణుగోపాల్ ఉన్నారు.

చెక్కు అందజేత

నర్సాపూర్(జి): మండలంలోని అంజనితండాలో శ్రీ సాయి బంజారా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను శుక్రవారం సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ప్రారంభించారు. ఈసందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రోత్సాహంగా రూ.ఐదు వేల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఫౌండేషన్ సీఈఓ అనిల్‌కుమార్, పీఆర్వో నరేశ్‌కుమార్, సభ్యులు ముత్యం, సాజిద్, వెంకటేశ్ గౌడ్, సంతోష్ శ్రీనివాస్, తానాజీ పాల్గొన్నారు.

పరిహారం చెక్కులు పంపిణీ

కుంటాల: మండలంలోని అంబుగామ అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడిలో ఇటీవల రెండు ఆవులు మృతి చెందగా.. యజమానులకు పరిహారం మంజూరైంది. శుక్రవారం బాధిత రైతులైన రాథోడ్ వినోద్‌కు రూ.15వేలు, గోరేకర్ మారుతికి రూ.20వేల విలువైన చెక్కులను భైంసాలో అటవీశాఖ అధికారులు అందించారు. ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్ఎస్‌ఓలు కీర్తి, సంధ్య, ఎఫ్‌బీవో లు హరిలత, మహేశ్వర్, కృష్ణ, లెనిన్ పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

తానూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఎస్టీయూ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు శంకర్, మాధవ్‌రావ్, సుదర్శన్, రవీందర్, శిరీష్‌కుమార్, సుజాతదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

భైంసాటౌన్: బాసర మండలం కిర్గుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ముత్యాల మనోరంజన సీఎంకప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. శుక్రవారం భైంసాలోని తన నివాసంలో విద్యార్థినిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్ శాలువాతో సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, చంద్రకాంత్, పాండురంగ్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కుంటాల: మండలంలోని కల్లూరు జాతీయ రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఏఎస్సై జీవన్‌రావు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు.

పాఠశాలల్లో నమూనా ఎన్నికలు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి ధర్మోర, పుస్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. హెచ్‌ఎంలు సుభాశ్, చంద్రప్రకాశ్, ఉపాధ్యాయులు నారాయణ్, గంగాధర్, శంకర్ ఉన్నారు.


భైంసాలో భోగిపండ్లు పోస్తున్న విద్యార్థులు


లోకేశ్వరం: రాజూర ప్రాథమిక పాఠశాలలో..


నిర్మల్‌లోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో..


బాసరలో ముగ్గు వేస్తున్న చిన్నారులు


లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ముందస్తు సంక్రాంతి

జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి విద్యార్థులకు పండుగ సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పాఠశాలల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్


నిర్మల్‌లోని ఓ పాఠశాలలో..


ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..